బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు

- వీధుల్లో గుంపులుగా తిరుగుతూ దాడులు
- రోడ్డెక్కేందుకు జంకుతున్న జనాలు
- నిరుపయోగంగా ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంతో పాటు విలీన గ్రామాలైన చంద్రంపేట, బోనాల, ముష్టిపల్లి, రగుడు, పెద్దూరు, తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు బెడద రోజు రోజుకు పెరిగిపోతోంది. వీధుల్లో, రోడ్లపై గుంపులు, గుంపులుగా తిరుగుతూ దాడికి పాల్పడుతున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు, చిన్నారులు, వాహనదారులను లక్ష్యంగా దాడులకు పాల్పడుతున్నాయి. రాత్రివేళ అయితే వాహనాల వెంబడి పరిగెడుతూ వాహనదారులను ఇబ్బందులకు గురిచేయడంతో పలువురు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. వీధి కుక్కల నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో వీటి బెడద రోజు రోజుకు పెరిగిపోతోంది


రోడ్లపై సంచరిస్తున్న వీధి కుక్కలు

చీకటి పడితే అంతే..

చీకటి పడిందంటే రోడ్డు మీదకు రావాలంటే ప్రజలు బయపడుతున్నారు. పనులు ముగించుకొని ఇంటికి వెళ్లే వారిపై వీధి కుక్కలు రోడ్లపై తిరుగుతూ దాడులకు పాల్పడుతున్నాయి. చికెన్, మటన్ సెంటర్ల నిర్వాహకులు వాటి వ్యర్థాలను రోడ్డు పక్కన వేయడంతో గుంపులుగా సంచరిస్తున్నాయి. వాహనాల వెంబడి పరిగెత్తుతూ దాడి చేస్తున్నాయి. దీంతో వాహనదారులు అదుపుతప్పి కింద పడిన సంఘటనలు ఉన్నాయి. రోజురోజుకు వీటి సంఖ్య పెరగడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు వీటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


మూసి ఉన్న ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్

నిరుపయోగంగా ఏబీసీ

సిరిసిల్ల పట్టణ శివారులో వీధి కుక్కల నియంత్రణ కొరకు రూ.20 లక్షలతో ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ని ఏర్పాటు చేశారు. అప్పట్లో వీధుల్లో కుక్కల బెడద ఎక్కువ కావడంతో మున్సిపల్ అధికారులు ప్రత్యేక బృందాలతో వీధి కుక్కలను పట్టుకునేవారు. వాటిని ఏబీసీ సెంటర్‌కి తరలించి ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేసి తీసుకువచ్చిన చోట వదిలిపెట్టేవారు. ప్రస్తుతం సిబ్బంది లేకపోవడంతో ఏబీసీ సెంటర్ నిరూపయోగంగా మారింది. దీంతో కుక్కల బెడద పెరిగింది. అధికారులు స్పందించి ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వాహనాలను వెంబడిస్తున్నాయి



గ్రామాల్లో వీధి కుక్కల బెడద రోజురోజు బాగా పెరుగుతుంది. రాత్రివేళ మరింత దాడులకు పాల్పడుతున్నాయి. బైక్‌పై సిరిసిల్ల నుంచి చిన్నబోనాలకు వెళ్తున్న క్రమంలో బైపాస్ రోడ్డులో గుంపులుగా తిరుగుతూ వాహనాలను వెంబడిస్తున్నాయి. అధికారులు దృష్టి సారించాలి.

– ఎస్‌. సాయి, చిన్నబోనాల

వీధుల్లో తిరగలేకపోతున్నం



పట్టణంలో వీధుల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. బయటకు రావాలంటే భయంగా ఉంది. చికెన్, మటన్ సెంటర్ నిర్వాహకులు రోడ్డు పక్కన పారవేయడంతో కుక్కలు రోడ్లపై గుంపులుగా తిరుగుతూ దాడి చేస్తున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కలను పట్టుకోవాలి.

– అనిల్‌కుమార్, రగుడు

నియంత్రణ చర్యలు చేపడుతాం



కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. రూ.20 లక్షలతో ఏబీసీ సెంటర్‌ని ఏర్పాటు చేశాం. వీధి కుక్కలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సిబ్బంది వచ్చిన వెంటనే కుక్కలను పట్టుకొని ఏబీసీ సెంటర్‌కు తరలించి నియంత్రణకు చర్యలు చేపడుతాం.

– వెల్దండి సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరంలాంటిది


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంట: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం వరంలాంటిదని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్, అనంతారం, రహీంఖాన్‌పేట, ఇల్లంతకుంట గ్రామాల్లో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి చెక్కులను అందజేసి మాట్లాడారు. ఆడబిడ్డల పెళ్లి తల్లిదండ్రులకు భారం కావొద్దనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకం ద్వారా రూ.లక్ష 116 సాయం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ సంజీవ్, వైస్‌ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, సర్పంచులు జితేందర్‌గౌడ్, చల్ల నారాయణ, బిల్లవేని పర్శరాం, భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో రాణించిన విద్యార్థిని


ప్రశంసాపత్రం అందుకుంటున్న స్ఫూర్తి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్న గుర్రాల స్ఫూర్తి అనే విద్యార్థిని శ్రీసత్యసాయి సేవా సంస్థలు ఆదివారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించింది. జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ చేతుల మీదుగా స్ఫూర్తికి ప్రశంసాపత్రం, మెమొంటో అందించారు. ప్రధానోపాధ్యాయులు మురళీధర్, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

'బీడీ కార్మికులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు'

చందుర్తి: బీడీ కార్మికుల సంక్షేమ పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్‌కుమార్ అన్నారు. ఆదివారం చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో బీడీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీడీ కార్మికుల శ్రమను కమీషన్ ఏజెంట్లు దోపిడీ చేస్తున్నారని అన్నారు. వెయ్యి బీడీలు చేసిన ప్రతీ కార్మికురాలికి రూ.232 చెల్లించాలని, లేని యెడల వారిని నిలదీయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీలో వాటా తీసుకుంటున్న కార్మికుల సంక్షేమాన్ని మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. 2014 నుంచి పీఎఫ్ కలిగిన కార్మికులందరికీ జీవనభృతి ఇస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి మరిచాడని గుర్తు చేశారు. ఈ సమావేశంలో తోట ధర్మేందర్, కృష్ణ, పద్మ, శాంత, నీలమ్మ, శ్యామల, రాధ, జ్యోతి, వినోద, కవిత, లక్ష్మి, రేణుక, మంజుల, మమత తదితరులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపార రంగంలో రాణించాలి

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

బోయినపల్లి: మహిళలు పురుషులతో సమానంగా వ్యాపార రంగంలో రాణించాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మహిళా సంఘం రుణంతో ఉపాధి పొందుతున్న షాపును ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రూ.2.50 లక్షల బ్యాంక్ లింకేజీ రుణంతో వ్యాపారం నెలకొల్పి నెలకు రూ.15 వేల వరకు ఆదాయాన్ని పొందడంపై అభినందించారు. ఈ సందర్భంగా వారి మహిళా సంఘానికి మంజూరైన రూ.24,545 విలువ గల వడ్డీ లేని రుణం ప్రొసీడింగ్ కాపీని అందించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని


ప్రొసీడింగ్ అందిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

బూర్గుపల్లి, కోరెం, మల్కాపూర్, స్తంభంపల్లి, దుండ్రపల్లి గ్రామాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే రవిశంకర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, మండల కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ అజ్జు, పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

- వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు రాము

వేములవాడఅర్బన్: మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కల రాము అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ మూడు నెలల క్రితం ముంపు గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం స్పెషల్ అధికారులను నియమించి నిర్వాసితుల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, ఇప్పటి వరకు స్పందన రాలేదన్నారు. సీఎం కేసీఆర్ ఒక్కో నిర్వాసిత కుటుంబానికి రూ.5.04 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు నేరవేర్చలేదన్నారు. ఇప్పటి వరకు కొందరి నిర్వాసితులకు పట్టాలు, ప్యాకేజీ, ఇళ్లు, భూముల


వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కల రాము

నష్టపరిహారం డబ్బులు రాలేదన్నారు. వారు అప్పు చేసి ఇళ్లు కట్టుకుని ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి అమ్ముకుంటున్నారని, వెంటనే హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. పార్టీ నాయకులు ప్రశాంత్, అనిల్, కరుణాకర్, మహేశ్, అనంద్, రూపేశ్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



రోడ్డు ఇలా.. ప్రయాణం చేసేదేలా.?

చందుర్తి: రెండు మండలాల సరిహద్దు గ్రామాలైనా ఎన్గల్- హన్మాజిపేట గ్రామాల మధ్య గల రోడ్డు చెదిరి పోయిన మోకాలు లోతు గుంతలు పడ్డాయి. అంతేకాకుండా పొలాల్లోని నీరు రోడ్డు పైకి రావడంతో గుంతల లోతు తెలియక అనేక మంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా గుంతలమయంగా మారిన ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ద్విచక్ర వాహనదారులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : సతీశ్, ఆర్‌అండ్‌బీ ఏఈ, చందుర్తి, వేములవాడ
ఫోన్ నెం: 94408 18862

ఎంపీ బండి సంజయ్ చిత్రపటానికి క్షీరాభిషేకం


వేములవాడ/సిరిసిల్లఅర్బన్/వీర్నపల్లి/కోనరావుపేట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పదవి చేపట్టి మూడేళ్లు గడిచిన సందర్భంగా సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా, వేములవాడ తెలంగాణ చౌక్, వీర్నపల్లి, కోనరావుపేట మండల కేంద్రాల్లో బీజేపీ ఆధ్వర్యంలో ఎంపీ బండి సంజయ్‌కుమార్ చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకుల మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించని, మాట్లాడని బీఆర్‌ఎస్ నాయకులు, మహిళలకు మద్దతుగా పోరాటం చేస్తున్న బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేయడం సరైందికాదన్నారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గునుగుల దేవేందర్‌రెడ్డి,


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గొట్టె రామచంద్రం, బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షులు మల్లేశం దిశ కమిటీ సభ్యులు పీర్య మాజీ బీజేవైఎం మండల అధ్యక్షులు వినోద్ కుమార్, ఎర్రగడ్డ గ్రామ బూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు.

లూజ్ వైర్లు.. వంగిన స్తంభాలు

వేములవాడరూరల్: గ్రామాల్లో విద్యుత్ లూజ్ వైర్లను సరిచేయాలని మండల సర్వసభ్య సమావేశంలో అధికారులు మొర పెట్టుకున్నా సంబంధిత శాఖ అధికారులు పెడచెవిన పెడుతున్నారని గ్రామాల ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. వేములవాడ రూరల్ మండలంలోని 17 గ్రామాల్లో దాదాపు అన్ని గ్రామాల్లో ఈ సమస్యలు ఉన్నాయి. చెడిపోయిన స్తంభాలు, లూజ్‌వైర్లు, వంగిన స్తంభాల సమస్యలపై సమావేశంలో ఆ శాఖ అధికారులకు చెబుతూనే ఉన్నారు. అయినప్పటికీ చాలా గ్రామాల్లో నేటికీ లూజ్ వైర్లను సరి చేయడం లేదు. పొలాల్లో లూజ్ వైర్లు ఉండడం వల్ల వరి నాట్లు,


పొలాల్లో ఉన్న లూజ్ వైర్లు

కోతల సమయంలో వాహనాలు వెళ్తూ లూజ్ వైర్లను గమనించకపోతే ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికై నా సెస్ అధికారులు ఇలాంటి వాటిని సరి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

అధికారులను సస్పెండ్ చేయాలి

వేములవాడఅర్బన్: బీజేవైఎం ఎన్నో పోరాటల ఫలితంగా వచ్చిన నియామకాల ప్రక్రియలో పరీక్ష పత్రాలు లీక్ అవడాన్ని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జింక అనిల్ ఖండించారు. నిరుద్యోగుల జీవితాలతో ముడిపడిన ఈ ఘటనకు నైతిక బాధ్యత వహించిన చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలన్నారు. ప్రశ్నపత్రాల లీక్‌లో నిర్లక్ష్యం వహించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ముస్తాబాద్: మండలంలోని నామాపూర్‌లో ఆరుగురు లబ్ధిదారులకు రూ.1.24 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు జెడ్పీటీసీ గుండం నర్సయ్య ఆదివారం పంపిణీ చేశారు.

వీర్నపల్లి: మండలంలోని అడవిపదిర గ్రామంలో సర్పంచ్ ఎడ్ల లక్ష్మీరాజం ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సర్పంచ్ ఎడ్ల లక్ష్మీరాజం ఆదివారం అందజేశారు.

నియామకం

నూతన కార్యవర్గం

సిరిసిల్లటౌన్: దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా బియ్యంకార్ శ్రీనివాస్, చీకోటి అనిల్‌కుమార్, అధ్యక్షుడు మంగళారపు రాజేందర్, ఉపాధ్యక్షుడు యెల్లె హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి వెల్ది గణేశ్, సహాయ కార్యదర్శి బొద్దుల రవి, ఆకుల సంధ్య, కోశాధికారి మామిడాల నరేశ్, కార్యవర్గసభ్యులుగా ఎండీ ఖాదర్, మిట్టపల్లి రమేశ్, అమర్నాథ్, లత, శ్రీధర్‌ను ఎన్నుకున్నారు.

చలివేంద్రం ఏర్పాటు

తంగళ్లపల్లి: మండలంలోని పద్మనగర్ గ్రామ పరిధిలో ఆదివారం గ్రామ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయగా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కొరకు బీజేపీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. మండల అధ్యక్షుడు సురువు వెంకట్, మండల ప్రధాన కార్యదర్శి సందెవేణి రాజు, అమరగొండ రాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు కోల ఆంజనేయులుతో పాటు నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావాలని పీరీలకు మొక్కులు

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరుతూ రాష్ట్ర పీసీసీ మాజీ అధికార ప్రతినిధి చీటీ ఉమేశ్‌రావు ఆదివారం సత్య పీరీల దర్గా వద్ద కందూర్ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి శివారులోని ఈ దర్గాకు చాదర్ కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పీసీసీ ప్రచార కమిటీ నాయకులు అజ్మతుల్లా హుస్సేన్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ దిష్టిబొమ్మ దహనం


బీఆర్‌ఎస్ దిష్టిబొమ్మను దహనంచేస్తున్న నాయకులు

ముస్తాబాద్: లిక్కర్ స్కాంను పక్కదారి పట్టించేందుకే బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారని బీజేపీ నాయకులు అన్నారు. ముస్తాబాద్‌లో బీఆర్‌ఎస్ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు ఆదివారం దహనం చేసి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జిల్లా అధికార ప్రతినిధి సంతోష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కస్తూరి కార్తీక్‌రెడ్డి, క్రాంతి, జనార్దన్, గిరిధర్‌రెడ్డి, నరేశ్, శంకర్, వెంకటేశ్, మల్లేశ్, గోపి, తిరుపతి పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్ష పదవికి రాజీనామా

ఇల్లంతకుంట: మండల బీజేపీ అధ్యక్ష పదవికి బెంద్రం తిరుపతిరెడ్డి రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణకు ఆదివారం రాజీనామా పత్రాన్ని అందజేశారు. మండల అభివృద్ధి పనులకు ఎంపీ సంజయ్ నిధులు కేటాయించకపోవడంతోనే రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

దోభీఘాట్ ప్రహరీ ప్రారంభం

సిరిసిల్ల: సిరిసిల్ల నెహ్రూనగర్‌లో సొంత ఖర్చులతో దోభీఘాట్‌కు నిర్మించిన ప్రహరీ, గేటును రజక సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. మాజీ డీఎంఅండ్‌హెచ్‌వో చంద్రశేఖర్, అమూల్య, సందీప్, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం

తంగళ్లపల్లి: మహిళా దినోత్సం సందర్భంగా మండలం నేరెళ్ల గ్రామంలో ఎంపీపీ పడిగెల మానస కేక్ కట్ చేసి ఆటల పోటీల్లో విజయం సాధించిన వారికి బహుమతులు అందజేశారు. మహిళా సంఘాలకు వడ్డీ వాపస్ రూ.8,24,000 ప్రొసీడింగ్స్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, ఐకేపీ సీసీ కిష్టస్వామి, వీవో అధ్యక్షురాళ్లు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో మూడు లేగ దూడల మృతి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో ఆదివారం వీధి కుక్కల దాడిలో మూడు లేగ దూడలు మృతి చెందాయి. వారం క్రితం ఇదే రైతుకు చెందిన ఒక లేగ దూడ కుక్కల దాడిలో మరణించగా, తాజాగా ఈ దాడిలో మరో మూడు లేగ దూడలు మృతి చెందాయి. మండల కేంద్రానికి చెందిన మల్లేశం అనే రైతు తన వ్యవసాయ పొలం వద్ద పశువుల పాకలో కట్టివేసి ఉంచిన లేగ దూడలపై కుక్కలు గుంపుగా దాడి చేయగా అవి అక్కడిక్కడే మృతి చెందాయి. బాధిత రైతును ఆదుకోవాలని కోరుతున్నారు.

మొక్కల సంరక్షణలో..

- నర్సరీల్లో చలువ పందిళ్లు
- 33 గ్రామాల్లో 3.30 లక్షల మొక్కలు
- ఎండకుండా జాగ్రత్తలు

ఇల్లంతకుంట: హరిత నర్సరీల్లో పెంచుతున్న మొక్కల సంరక్షణకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఎడాది ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధిహామీ నిధులతో నర్సరీలు ఏర్పాటు చేశారు. నర్సరీలలో మొక్కలు ఎందకు ఎండిపోకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఇల్లంతకుంట మండలంలోని 33 గ్రామాల్లోని నర్సరీల్లో ఈ ఏడాది 9వ విడత హరితహారం కోసం 3.30 లక్షల మొక్కలను పెంచుతున్నారు. గత ఏడాది మిలిగిన ఉన్న 1.50 లక్షల మొక్కలు నర్సరీల్లో నిల్వ ఉన్నాయి. మొత్తం ఈ ఏడాది 4.80 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యం పెట్టుకున్నారు. నర్సరీలలో మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు అధికారులు, సిబ్బంది మొక్కలపై చలువ పందిళ్ళు(షేడ్ నెట్లు) ఏర్పాటు చేశారు. ఎండ వేడిమి తగలకుండా నర్సరీ చుట్టూ వెదురు బొంగులు ఏర్పాటు చేశారు. ఉపాధిహామీ కూలీల ద్వారా ఉదయం, సాయంత్రం వేళల్లో నర్సరీలలో మొక్కలకు నీళ్లు పట్టిస్తున్నారు.

నర్సరీలతో కూలీలకు ఉపాధి

మండలంలోని 33 నర్సరీల్లో ఒక్కో నర్సరీలో 10 వేల చొప్పున మొక్కలను పెంపకం చేస్తున్నారు. గత జనవరి చివరి మాసం వరకు పాలిథిన్ కవర్లలో మొక్కల పెంపకం కోసం విత్తనాలను నాటడం జరిగింది. ఇప్పటి వరకు నర్సరీల్లో 50 శాతం మొక్కలు మొలిచినట్లు అధికారులు చెబుతున్నారు. గత జనవరి మాసంలో ఈ 33 నర్సరీలో సుమారు 400 మంది వరకు కూలీలు పని చేశారు. ప్రస్తుతం ప్రతి నర్సరీలో ఒక్కొక్కరు మొక్కలకు నీరు పట్టేందుకు పనిచేస్తున్నారు.

చలువ పందిళ్లు

ఎండాకాలం మొక్కలు ఎండిపోవడం, ఎదుగు


నర్సరీలో పెంచుతున్న మొక్కలు

దల సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ఎండ నుంచి మొక్కలను సంరక్షించేందుకు అధికారులు షేడ్‌నెట్లను ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే జూన్ చివరి మాసం నాటికి 9వ విడత హరితహారం కోసం మొక్కలన్నీ సిద్ధం చేస్తున్నారు. అప్పటి వరకు మొక్కలు ఎండకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ

మండలంలోని 33 నర్సరీల్లో మొక్కలను ఎప్పటికప్పుడు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులందరూ ఎప్పటికప్పుడు నర్సరీలను పర్యవేక్షిస్తున్నారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు పలు సూచనలు చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నం



ప్రస్తుతం వేసవికాలం సీజన్ కావడంతో మొక్కలు ఎండిపోకూడదనే ఉద్దేశ్యంతో 33 నర్సరీల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేయిస్తున్నాం. ప్రతిరోజు మొక్కలకు ఉదయం, సాయంత్రం నీరు పట్టే విధంగా ఆదేశాలు జారీ చేయడం జరిగింది. జూన్ చివరి వారం నాటికి మండలంలో హరితహారం కోసం మొక్కలను సిద్ధం చేయడం జరుగుతుంది.

– పులి చంద్రయ్య, ఏపీవో, ఇల్లంతకుంట